

పండ్లు, స్వీట్లు, బొకేల ధరలకు రెక్కలు

- జిల్లాలో భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు

ప్రజాశక్తి - రాయచోటి

నూతన సంవత్సర వేడుకలు అంటేనే స్వీట్లు, కేకులు, బుకేలు, పూలు, పండ్లు తప్పక కొనుగోలు చేస్తారు. 2024 పూర్తయి 2025వ సంవత్సరానికి నూతన సంవత్సరం వేడుకలను అన్నమయ్య జిల్లాలో ఘనంగా నిర్వహించుకోనున్నారు. అధికారులకు, నాయకులకు కింది స్థాయి సిబ్బంది పూలమాలలు వేసి బుకే అందించి కేకులు కట్ చేయించడం నూతన సంవత్సర ఆనవాయితీ. ఈనేపథ్యంలో కొందరు విచ్చలవిడిగా డబ్బులు వెచ్చించి వాటిని కొనుగోలు చేసి నూతన సంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. మరికొందరు ఏకంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు అంటూ ఎక్కడబడితే అక్కడ భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వారి అభిమానాన్ని చాటుకుంటూ ఉంటారు. ప్రస్తుతం పండ్లు, పూలు, బొకేల ధరలకు ఆకాశానంటాయి. ఆపిల్ పండు మామూలుగా కిలో రూ. 150 ఉండగా, కొత్త సంవత్సరం వేడుకల పుణ్యమా అని అమాంతంగా రూ. 270, పుల హారలు రూ .100 నుండి రూ.400, బుకెలు రూ. 200 నుంచి రూ.500, కేక్ ధర అయితే కేజీ రూ.250 నుంచి రూ. 400 చొప్పున అమ్మకాలు సాగిస్తున్నారు.

కోటి ఆశలతో..



- పాలకుల నోట.. ప్రగతి బాట
- గిట్టుబాటు దక్కాలని రైతులు
- కొలువుదీరాలని నిరుద్యోగులు
- డిమాండ్లు నెరవేరాలని ఉద్యోగులు
- నూతన ఆశయాలు..ఆకాంక్షలతో ముందుకు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కోటి ఆశలు... కొత్త ఆశయాలతో జిల్లా వాసులు జోష్ 2025కు స్వాగతం చెప్పేశారు. ఈ ఏడాది అనుకున్న లక్ష్యాలు నెరవేరాలని సర్వత్రా ఆశిస్తున్నారు. జిల్లాను విద్య, వైద్యం తదితర అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలిపేందుకు ఓ వైపు అధికార యంత్రాంగం మరోవైపు ప్రజాప్రతినిధులు ఆకాం క్షిస్తున్నారు. ఇందుకోసం ప్రణాళికాల బద్దంగా ముందుకు సాగు తామంటున్నారు. ఇటీవల కొన్ని నోటిఫికేషన్ల నేపథ్యంలో సర్కారు ఉద్యోగమే లక్ష్యంగా నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. ఈ ఏడాది ఎలాగైనా 'కొలువు' దీరాలని భావిస్తోంది. గతేడాది సాగు నిరాశ మిగిల్చగా.. ఈసారైనా తమ పంట పండాలని అన్నదాత ఆశపడుతున్నాడు. వరుణిడి కరుణ తోపాటు గిట్టుబాటు దక్కాలని వేడుకుంటున్నాడు. నేరాలు–ఘోరాలకు అడ్డుకట్ట వేయాలని పోలీసు శాఖ భావిస్తుండగా... 'ఆమె'పై అఘాయిత్యాలు ఆగాలని మహిళా లోకం కోరు కుంటోంది. సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ, ఉద్యోగవర్గాలు ఎదురుచూస్తున్నాయి. ఈ నూతన సంవత్సరం అందరి ఆకాంక్షలు నెరవేరాలని ఆశిస్తూ.. హ్యాపీ న్యూ ఇయర్.

అభివృద్ధికి శాయశక్తులా కృషి

నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తా. నూతన సంవత్సరంలో కులమతాలకు అతీతంగా ప్రజలందరు కలిసి మెలిసి ఉండాలి. అందరి మధ్య ప్రేమాను రాగాలు ఉండాలి. ఆరోగ్యంతో పాటు ఐశ్వర్యం కలగాలని కోరుతున్నా, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ. కొత్త ఏడాది నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతాం. గతంలో చేపట్టి పూర్తి కాని వాటిని ఈ ఏడాదిలో పూర్తి చేస్తాం. ఏ పనుల్లోనూ అంతరాయం కలుగకుండా చూస్తాం. జిల్లా సస్యశామలంగా ఉండడానికి ప్రయత్నం సాగిస్తాం. ఇందుకు ప్రజల సహాయ సహకారాలు ఉండాలని కోరుతున్నా.

- ఎం.రాంప్రసాద్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి.

ప్రభుత్వం సహకరించాలి

ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా ప్రభుత్వ సహకారం తప్ప నిసరి. కడప–బెంగళూరు రైల్వే లైను ప్రభుత్వం కొంత శాతం నిధులివ్వాల్సి ఉంది. జిల్లా కేంద్రంలో కొన్ని ప్రభుత్వ భవనాల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. వీటికి ప్రభుత్వం సహకరిస్తే నా వంతు కృషి చేస్తా. అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయి. పార్లమెంట్ పరిధిలోని పలు మండలాల్లో రోడ్ల కోసం ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపితే వాటి నిర్మాణానికి అవసరమైన నిధులు తెప్పించేలా కృషి చేస్తా. ప్రజలకు అందుబాటులో ఉంటూ కేంద్ర పరంగా ఎలాంటి సహాయ, సహకారాలు అవసరమైనా అందించేందుకు సిద్ధంగా ఉన్నా.

- పి.మిథున్‌రెడ్డి, ఎంపి, రాజంపేట.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం. గంజాయి, మట్కా తదితర వాటిపై ఉక్కుపాదం మోపుతున్నాం. ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. మహిళలపై నేరాలు తగ్గు ముఖం పట్టేవిధంగా చూస్తాం. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ సహకరించాలి. తల్లిదం డ్రులు మైనర్లకు వాహ నాలు ఇవ్వొద్దు.

- విద్యాసాగర్ నాయుడు, ఎస్‌పి, రాయచోటి.



ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యతనిస్తాం. జిల్లా కేంద్రాన్ని అన్నిరంగాల్లో ప్రగతిబాట పట్టించేలా చర్యలు తీసుకుంటాం. అభివృద్ధి పనుల్లో పారదర్శకత ఉండేలా శ్రద్ధ వహిస్తాం. కౌన్సిల్, ప్రజలకు మధ్య అనుసంధాన కర్తగా విధులు నిర్వహిస్తా.

-వాసుబాబు, మున్సిపల్ కమిషనర్, రాయచోటి.

విద్యారంగ సమస్యలు పరిష్కారమవ్వాలి

కొత్త ఏడాదిలోనైనా ఉపాధ్యాయ సమస్యలు పూర్తిగా పరిష్కారం కావాలని ఆశిస్తున్నాం. నెలవారి ఉద్యోన్నతులు లేవు. ఉపాధ్యాయ లోకం వీటి కోసం నిరీక్షిస్తోంది. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి. ప్రభుత్వ విద్యారంగా బలోపేతం కోసం చర్యలు తీసుకోవాలి. పాఠశాలలో ఉపాధ్యాయులకు భద్రత కల్పించాలి.

-షేక్ జాబీర్,యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాయచోటి.

రైతుకు గిట్టుబాటు ధర అందాలి

రైతులు పండించిన పంటలకు గిట్టుబాబు ధర అందాలి. రైతు ఆత్మహత్యలు జరగకుండా రెవెన్యూ శాఖ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటల సాగుపై అన్నదాతకు అవగాహన కల్పించాలి. జిల్లాలో ప్రతి ఎకరాకు నీటి లభ్యత ఉండేలా ప్రాజెక్టులు, చెరువుల నిర్మాణం చేపట్టాలి.

- ఎస్.రామచంద్ర, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, రాయచోటి.

కొలువు సాధించడమే లక్ష్యం

ప్రభుత్వ వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు విడుదల చేయాలి. ఈ ఏడాది కొలువు సాధించాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా చదువుతున్నా. ఇలాంటి అవకాశం మళ్లీ మళ్లీ రాదు. కచ్చితంగా సద్వినియోగం చేసుకుంటా.

-గాజుల మహమూద్ బాషా, నిరుద్యోగి, రాయచోటి.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి. మన రాష్ట్రపతిగా మహిళ ఎన్నికవడం అందరికీ గర్వ కారణం. 2025లో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి. మహిళలపై దాడులు, అత్యాచారాలు తగ్గాలి. మహిళలంతా తమ మగ పిల్లలకు సంస్కారం, సభ్యత నేర్పించాలి. అప్పుడే మహిళలపై అఘాయిత్యాలు తగ్గుతాయి

- పి.రమాదేవి, ఐసిడిఎస్ పీడీ, రాయచోటి.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి–చిన్నమండెం

అధికారులు రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయని రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం భూసమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి మండలంలో వీఆర్‌ఓ నుంచి తహశీల్దార్ వరకు గ్రామాలలో పర్యటించి భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. రాబోయే రోజులలో రాయచోటి నియోజకవర్గంలో శాశ్వత భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్లడం జరుగుతుందని అధికారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. మంత్రి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

పశువైద్యశాలలో మంత్రి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి–సంబేపల్లి(రాయచోటి)

మండలంలోని దుద్యాల గ్రామంలోని పశు వైద్యాధికారిపై రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం దుద్యాల గ్రామంలోని పశువైద్యశాలను మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సంబేపల్లి పశు వైద్యశాల దగ్గరికి వెళ్ళగానే కార్యాలయానికి తాళాలు వేసి ఎవరూ లేకపోవడంతో మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పశు సమర్ధశాఖ అభివృద్ధికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే సంబేపల్లిలో పని చేసే పశువుల డాక్టర్, వారి సిబ్బంది కార్యాలయానికి తాళాలు వేసి ఇళ్ల దగ్గర ఉండడం ఏమాత్రం మంచిది కాదన్నారు. మంత్రి వెంటనే పశువుల డాక్టర్‌కు ఫోన్ చేసి పశువుల ఆసుపత్రిలో ఎంత మంది పనిచేస్తున్నారు. ఈరోజు ఆఫీసు ఎందుకు తెరవలేదని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. దుద్యాల గ్రామ ప్రజలు మంత్రితో మాట్లాడుతూ పశువుల ఆసుపత్రికి డాక్టర్ గాని వారి సిబ్బంది గాని నెలకు రెండు, మూడు రోజులు తప్ప ఎప్పుడూ ఆసుపత్రికి రారన్నారు. పశువులకు వ్యాధులు సోకినప్పుడు కనీసం సూది వేసే దిక్కు కూడా లేరని అక్కడి ప్రజలు మంత్రికి ఫిర్యాదు చేశారు. పశువైద్యాధికారిపై చర్యలు తీసుకోకపోతే సంబేపల్లి మండలంలో పాడి రైతులకు చాలా ఇబ్బందిగా ఉందని వెంటనే పశువుల డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వారు మంత్రికి తెలిపారు. మంత్రి స్పందించి ఈ సమస్యను పరిశీలించి ఇకనుంచి ప్రతిరోజు పశువుల ఆసుపత్రి తెరిచి ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్, సిబ్బంది పాడి రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రజలకు తెలిపారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తి వెలుగులోకి వస్తుందని, విద్యార్థులు చిన్ననాటి నుండే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణం లోని డైట్ కళాశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ప్రాజెక్టుల విశేషాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ చిన్ననాటి నుండే సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించు కోవాలన్నారు. వినూత్న ఆలోచనలతో సాంకేతికతను అందిపుచ్చుకుని అత్యున్నత స్థానానికి ఎదగాలన్నారు. గురువుల పైనే విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉంటుందని, విద్యార్థులలో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే సైన్స్‌తోనే అది సాధ్యమవుతుందని చెప్పారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా విద్యార్థులు పరిశీలించటం అలవాటు చేసుకోవాలని అప్పుడే మనం అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చుని, భావి శాస్త్రవేత్తలుగా ఎదగవచ్చుని తెలిపారు. విద్య అంటే కేవలం మార్కుల సాధనే కాదని, జ్ఞానం, నూతన పరిశో ధనల పట్ల జిజ్ఞాస పెంచుకోవటమని పేర్కొన్నారు. ఎపిజె అబ్దుల్ కలాం, సర్ సి.వి రామన్, కల్పనా చావ్లా, సునీతా విలియమ్స్ తదితర మహోన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు స్వేచ్ఛగా ఆలోచించే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మార్గదర్శనం చేయాలని సూచించారు. ప్రాజెక్టుల ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 6 ప్రాజెక్టులకు మంత్రి తన చేతుల మీదుగా మెమెంటోలను సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మండలానికి 3 చొప్పున 30 మండలాల నుండి మూడు విభాగాలలో 90 ప్రాజెక్టులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డిఇఒ సుబ్రహ్మణ్యం, ఉప విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాసరాజు, తెలుగుదేశం నాయకులు రవీంద్రారెడ్డి, స్కౌట్స్ జిల్లా సెక్రెటరీ నరసింహారెడ్డి, డిసిఇబి సెక్రటరీ నాగ మునిరెడ్డి, అప్కాస్ట్ అకాడమిక్ కో–ఆర్డినేటర్ రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో ఇఎస్ఐ ఆస్పత్రిని నిర్మించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటిలో కార్మిక, ఉద్యోగుల వైద్య ఆరోగ్య భద్రతకు ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలలో పర్మినెంట్, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్, కనీస వేతనం పొందుతూ ఇఎస్ఐ అమలవుతున్న కార్మిక ఉద్యోగుల వైద్య ఆరోగ్య అవసరాలకు జిల్లా కేంద్రంలో ఆసుపత్రి లేకపోవడం వల్ల దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. అందుకోసం సెలవు పెట్టుకోవడం ఇబ్బందులు పడడం,ఇతర ప్రాంతాలకు కార్డు చెల్లు బాటు కాకపోవడం మరికొందరికి ఇఎస్ఐ కార్డు ఉన్నా సాంకేతిక సమస్య తో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో బీడీ కార్మికుల సంక్షేమం కోసం రెడ్డీస్ కాలనీలో ఉన్న డిస్పెన్సరీని ఉండేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎత్తి వేయడంతో కార్డు దారులు ఇక్కట్లకు గురవుతున్నారని తెలిపారు. ఇఎస్ఐ కార్డు ఉండే కార్మిక, ఉద్యోగుల వేతనాల్లో కోత విధిస్తున్నారని, కానీ వైద్య సౌకర్యం పొందలేక మళ్ళీ ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తు న్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో విద్యుత్, వైద్యం, మున్సిపల్, విద్యా రంగం ఆర్‌టిసి, బీడీ, దాదాపు 1500 నుండి 2 వేలు దాకా ఇఎస్ఐకి అర్హులు న్నారని చెప్పారు. ఇఎస్ఐ కార్పొరేషన్ నమోదు చేయని కార్మిక, ఉద్యోగులు వేలాది మంది ఉన్నారని చెప్పారు. వీరంతా అధిక పని భారం, వయోబారం, ప్రమాదాలబారీన పడుతున్నారని, అర్హత ఉండి కార్డు లేని వారందరికీ ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా కేంద్రం రాయచోటిలో ఇఎస్క్మి ఆసుపత్రి ఏర్పాటు చేసే దిశ గా కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి. రమణ, సిఐటియు నాయకులు శివ శంకర్, రాజు పాల్గొన్నారు.

ఇవిఎం గోడౌన్‌లో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాకు సంబంధించి ఇవిఎంలను భద్రపరిచిన గోదాం వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఉదయం రాయచోటి పట్టణ సమీపంలో ఉన్న మార్కెట్ యార్డ్‌లో ఉన్న ఇవిఎం గోడౌన్‌ను రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల సమక్షంలో గోడౌన్ లోపల భద్రపరిచిన ఆయా ఇవిఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్‌లను, అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అనంతరం వివిధ అంశాలలో రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. భద్రత పటిష్టంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పుల్లారెడ్డి, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహకుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వంద శాతం ప్రగతి సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి–రైల్వేకోడూరు/చిట్వేలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మండలాలలో ప్రభుత్వ పథకాల పనులను చిత్తశుద్ధితో వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ మండల అధికారులను ఆదేశించారు. మంగళవారం రైల్వేకోడూరు, చిట్వేలు ఎంపిడిఒ కార్యాలయాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు ఒక లక్ష్యం పెట్టుకొని పని చేసినప్పుడే ప్రగతి సాధ్యమవుతుందన్నారు. ఇచ్చిన లక్ష్యాలను చేరుకోవడంలో శ్రద్ధ చూపాలన్నారు. రైల్వేకోడూరు, చిట్వేల్ మండలంలో గృహ నిర్మాణ ప్రగతిపై స్టేజి వారి ప్రగతిని సమీక్షించారు. గృహ నిర్మాణం చేపట్టడానికి ఎంత మంది లబ్ధిదారులకు రుణాల అవసరం అన్న వివరాలను మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తెలుసుకొని డిఆర్‌డిఎ ఎపిఎంకు ఇచ్చారా లేదా అని వివరాలు తెలుసుకున్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఇచ్చిన లబ్ధిదారులకు పూర్తిగా రుణాలు మంజూరు చేయకపోవడంపై రెండు మండలాల ఎంపిడిఒలు, ఎపిఎంల పని తీరుపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఇండ్లు పూర్తి చేయడంలో అవసరమైన వారికి రుణాలు ఇప్పించడంలో అశ్రద్ధ వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిపై ఎవరైనా అనుచితంగా లేదా దాడులు చేస్తారని భావించే వారి సమాచారం ఉంటే ముందస్తుగా తెలియజేయాలని సూచించారు. మండల కార్యాలయాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఐసిడిఎస్ పథకాల అమలుపై కూడా సమీక్షించారు. అనంతరం వివిధ అంశాలలో సమీక్షించి పలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు చిట్వేలు ఎంపిడిఒలు నాగార్జున, మోహన్, తాసిల్దార్లు మహబూబు చాంద్, మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై అవగాహన అవసరం : డిఎం

ప్రజాశక్తి–పీలేరు : రహదారి, శాంతి భద్రతల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పీలేరు ఆర్టీసీ డిపో మేనేజర్ బండ్ల కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో పీలేరు అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిపో మేనేజర్ బండ్ల కుమార్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 2025లో పీలేరు నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రహదారి నియమాలు ఖచ్చితంగా పాటించాలని గుర్తు చేశారు. వేడుకల పేరుతో పురవీధుల్లో గలాభా చేయరాదని, పోలీసుల ఆదేశాలను భద్రత నియమ, నిబంధనలను పాటించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. కొత్త సంవత్సర వేడుకల్లో ప్రజలు మరింత బాధ్యతాయుతంగా వెలగాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీలేరు అభివృద్ధి సమితి కన్వీనర్లు డాక్టర్ వంగిమళ్ళ రామచంద్ర, డాక్టర్ జానం గంగిరెడ్డి, పాత్రికేయులు పఠాన్ జాకీర్ హుసేన్, మల్లెల జాకీర్ హుస్సేన్, మానవత సంస్థ సభ్యుడు పోస్టల్ రమణ, బుక్ స్టాల్ పసుపులేటి రమణ, ఆటో యూనియన్ నాయకులు సయ్యద్ చాంద్ బాష, మహబూబ్ బాష, కలకడ బాబు, కిషోర్ కుమార్ రాజు, సాదిక్, శివయ్య, అల్తాఫ్, ఆర్టీసీ సిబ్బంది, స్థానిక ప్రయాణికులు, వివిధ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నాణ్యమైన విద్య కోసం పోరాటం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యకోసం పోరాడుతున్న ఏకైక విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ అని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గురునాద్ పేర్కొన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాయచోటి స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ జెండా ఎగురవేసారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ 1970 డిసెంబర్ 30న స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలుగా అధ్యయన పోరాటం నినాదంతో ఏర్పాటై నేటికి 55సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం 55 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం నిర్వహిస్తూ ఎస్ఎఫ్ఐ ముందుకు పోతుందన్నారు. ఎక్కడైతే విద్యార్థుల సమస్యలు ఎదుర్కొంటున్నారో ఆ సమస్యల పరిస్కారం కోసం పోరాటాలు నిర్వహించి విద్యార్థుల గుండెల్లో స్థానాన్ని సంపాదించుకున్న సంఘం ఎస్ఎఫ్ఐ అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడూ ఎండగడుతూ విద్యార్థులను పోరాటాలకు సిద్ధం చేస్తూ అనేక విజయాలను సొంతం చేసుకుందన్నారు. పేద విద్యార్థికి విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తు చేస్తూ పోరాటాలు నిర్వహిస్తుందని వారు తెలిపారు. విద్యా పేద విద్యార్థులకు అందని ద్రాక్షలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగ సమస్యల పరిస్కారం కోసం ఎన్నో నిర్బంధాలని, అక్రమ కేసులను ఎదుర్కొంటూ పోరాటాన్ని ముందుకు కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రెడ్డికుమార్, శివ పాల్గొన్నారు.

సాయి కళాశాలలో ఉచితంగా కంటి పరీక్షలు

ప్రజాశక్తి- రాయచోటి

శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం కళాశాల ఎన్ఎస్–ఎస్ విభాగం ఆధ్వర్యంలో పట్టణ శ్రీ వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఉచిత కంటి పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ జె.బి.వెంకటేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్, కంప్యూటర్ వాడుక సమయాన్ని తగ్గించి పౌష్టికాహారంతో 50 శాతం వరకు దృష్టిలోపాలను నివారించవచ్చని తెలియజేశారు. విద్యార్థులు దృష్టిలోపాలను మొదటి దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవాలని సూచించారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జీవనయానంలో ఇంద్రియాలన్నింటిలో కళ్ళు ప్రధానమైనవని, కంటికి ఎటువంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు వహించాలని, ప్రయాణ సమయంలో హెల్మెట్, కళ్ళ జోడు ధరించాలని పేర్కొన్నారు. నేత్ర దానంపై ప్రజలకు అవగాహన కల్పించి అంధుల జీవితంలో వెలుగులు నింపాలని తెలియజేశారు. కార్యక్రమంలో క్లినిక్ ఆప్తమాలిక్ అసిస్టెంట్ వేణుగోపాల్, సాంకేతిక సిబ్బంది అంజలి, రాజేష్ పాల్గొన్నారు. ఈ కంటి వైద్య శిబిరంలో సుమారు 170 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఎ.కరుణాకర్ వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటాం : మంత్రి

ప్రజాశక్తి–కడప అర్బన్

గాలివీడు ఎంపిడిఒపై దాడి జరిగిన సంఘటన హేయనీయమైనదని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటామని రవాణా, యువజన, క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం కడప రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపిడిఒ జవహర్ బాబును మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. ఈ సంఘటనను దృష్టిలో ఉంచుకొని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధైర్య పడవద్దని ధైర్యంగా ఉండాలని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో ఎక్కడ జరగకుండా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సంఘటనలు ఎక్కడ జరిగిన సహించేది లేదని హెచ్చరించారు. తొలుత దాడిలో గాయపడిన గాలివీడు ఎంపిడిఒ జవహర్ బాబును ఎలాంటి ఆందోళనకు గురికాకూడదని మనోధైర్యాన్ని కల్పించారు. అనంతరం రిమ్స్ ఆస్పత్రి వైద్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రిమ్స్ ఆసుపత్రి సూపరింటెండెంట్, జడ్పీ సిఇఒ ఓబులమ్మ, వైద్యులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.



ఎంపిడిఒను పరామర్శిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రగతిబాటలో ముందడుగేద్దాం : సిపిఎం

ప్రజాశక్తి–మదనపల్లె అర్బన్

స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం, ప్రగతి బాటలో ముందడుగేద్దామని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదాం, స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం, ప్రగతి బాటలో ముందడుగేద్దామని పిలుపునిస్తూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించి పట్టణంలో విస్తృతంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జీవితాలు మెరుగుపడే దిశగా సిపిఎం శక్తివంచన లేకుండా పాటుపడుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రజలందరినీ అభివృద్ధిపథంలో నడిపించాలంటే ప్రభుత్వం లౌకిక విలువలను ఆవశ్యంగా గౌరవించి పాటించాలని రాజ్యాంగం ఆదేశించినట్లు వివరించారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, వాటి ఆధీనంలో ఉండే వివిధ వ్యవస్థలు వారిని వెనకనుండి నడిపిస్తున్న సంఘ పరివారం లౌకికతత్వానికే కొత్త వక్రభాష్యాలు చెబుతూ, లౌకికతత్వం మత విశ్వాసాలకు వ్యతిరేకం అన్న పెడార్థాన్ని ప్రచారం చేస్తున్నారని, ప్రజల సమైక్యతను దెబ్బ తీసి విద్వేషాలను రాజేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్‌ను సైతం రాజ్యాంగ దినోత్సవం సందరక్భంగా పార్లమెంటు సాక్షిగా అమిత్ షా అవమానపరిచే స్థాయికి దిగజారారన్నారు. ఇలాంటి రాజ్యంగ వ్యతిరేకికి హోంశాఖ మంత్రిగా కొనసాగే అర్హత లేదన్నారు. పెరిగిపోతున్న నిరుద్యోగాన్ని, పేదరికాన్ని, ప్రజల ఈతిబాధల్ని పట్టించుకోవడం లేదని, ప్రజలు పోరాడకుండా దారి తప్పించడానికి మతోన్మాద విషబీజాలు వెదజల్లుతున్నారన్నారు. మతోన్మాద శక్తుల కుట్రలను తిప్పి కొట్టేందుకు మనమంతా భారతీయులమేనంటూ మత స్వేచ్ఛను గౌరవించుకుంటూ, మతం రాజకీయాలకు దూరంగా ఉండాలని పిలిపునిచ్చారు. హక్కులను సాధించుకోవడానికి ప్రజలు సమైక్యంగా పాటుపడాలని, ఆ సమైక్యతకు విఘాతం కలిగించే ఏ విద్వేషపూరిత భావోద్వేగాలనూ దరి చేరనివ్వకూడదని, "తెలుగుజాతి మనది–నిండుగ వెలుగు జాతి మనది" అని మనలో ప్ర ఒక్కరూ గర్వపడేలా నడుద్దామని, గడప లోపలే మతం గడప దాటితే భారతీయులం అన్న సహోదర భావంతో ముందడుగు వేద్దామని పిలుపునిచ్చారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు



లబ్ధిదారులకు పించను అందిస్తున్న రూపానందరెడ్డి

అర్హులందరికీ పించన్లు

ప్రజాశక్తి-పెనగలూరు

కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ పించన్లు అందుతున్నాయని కుడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని నల్లపురెడ్డి పంచాయతీలలో, సింగారెడ్డిపల్లి పంచాయితీ కంబాలకుంట గ్రామాల్లో పింఛన్ దారులకు పింఛన్‌ను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఓబులవారిపల్లి మండల పంచాయతీలలో, కోడూరు మండలంలోని కొత్తబజార్, శాంతినగర్ కాలనీ, చిట్వేలి మండలంలోని తిరుమల శెట్టిపల్లి, నాగవరం పంచాయతీ, చొప్పవారిపల్లి గ్రామాలలో ఇంటింటికి వెళ్లి స్వయంగా పింఛన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ ఒకరోజు ముందే పింఛన్లను అందిస్తున్న ఘనత సిఎం చంద్రబాబుదేనని అన్నారు. పింఛన్లపై వైసిపి లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. పెంచిన పింఛన్లతో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, ఒంటరి మహిళలు, వితంతువులు ఆనందంతో ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీ నాయకులు, కుటమి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. **రామాపురం :** మండలంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ 96.79శాతం జరిగినట్లు ఎంపిడిఒ జాషువా తెలిపారు. మండలంలోని 13 పంచాయతీలలో ఉదయం 5 గంటల నుంచి సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు , కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి విభిన్న ప్రతిభావంతులకు పింఛన్లను అందించారు. కుమ్మరపల్లి99.9, చిట్లూరు 98.48, నీలకంఠరావుపేట 98 .1, కల్పనాయిల్ చెరువు 98, గువ్వల చెరువు 97.91, బండపల్లి 97.59, సరస్వతి పల్లి 97.45, నల్లగుట్టపల్లి97.1, హసనాపురం 96.79, గోపగుడిపల్లి 96.05, సుద్దమల్ల 95.35, రాచపల్లి 94.54, సూర్యనారాయణపురం 93.24 శాతం ఫించన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు.

కువైట్‌లో నీలకంఠరావుపేట వాసి మృతి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నీలకంఠరావుపేటకు చెందిన సయ్యద్ జియావుద్దీన్ కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపారు. జియావుద్దీన్ జీవనోపాధికై కువైట్‌కు వెళ్లినట్లు తెలిపారు. అక్కడ ఇంట్లో పని చేస్తూ ఉండేవాడని సోమవారం రాత్రి నీరసంగా ఉందని తన తోటి సహచరులతో తెలియజేయడంతో ఆస్పత్రికి తీసుకు వెళ్లే లోపు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపారు. జియా వుద్దీన్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులుకన్నీరు మునీరుగా విలపిస్తున్నారు.



పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న సిఐ

నూతన సంవత్సర వేడుకలకు కట్టుదిట్టమైన బందోబస్తు

ప్రజాశక్తి -బి.కొత్తకోట

నూతన సంవత్సర వేడుకలకు కట్టు దిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు బి.కొత్తకోట సిఐ జీవన్ గంగానాథ్ బాబు పేర్కొ న్నారు.ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో బందో బస్తు నిమిత్తం అదనంగా స్పెషల్ ఫోర్స్ ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంగళవారం సిఐ స్పెషల్ ఫోర్స్‌కు సూచనలు, సలహాలు అందజేశారు. హార్సిలీహిల్స్ తోపాటు బి.కొత్తకోట పట్టణం, మండల పరిసరాలలో ఎటువంటి అవాంఛనీయ ఘట నలు జరుగకుండా ముందస్తుగా ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు.



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ

ఇ-పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని రామసముద్రం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రబీ పంటకు సంబంధించిన ఇ-పంట నమోదు రైతు నరసింహనాయుడు పొలంలో రైతులందరికీ ఇ-పంట నమోదు చేయించడం జరిగిందని ఎఒ తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి పి.మస్తాన్ మాట్లాడుతూ రైతులందరూ కూడా ఇ-పంట నమోదు చేయించుకోవాలని, ప్రతి రైతు కూడా ప్రకృతి వ్యవసా యంపై మొగ్గు చూపాలని అన్నారు. ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, కషాయాలు వాడటం వలన ఖర్చులు తగ్గించుకొని ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. కూరగాయలు, ఆకుకూరలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించుకుని తినడం వలన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది గాయత్రి, ప్రభాకర్, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన పైలెట్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కలకడ

ప్రమాదంలో గాయపడిన పైలెట్ అంజికి సాటి 108 వాహనాల పైలెట్లు ఆర్థిక సాయం అందించినట్లు అన్నమయ్య జిల్లా 108 యూనియన్ నాయకుల అధ్యక్షులు ఎస్‌వి.రమణ, ఉపాధ్యక్షులు వెంకట చలపతి తెలిపారు. పెద్దమండెం మండలం కలిచర్లకు చెందిన అంజి 108 వాహనంలో విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు. కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో ఉన్న రోగిని తిరుపతిలోని రుయా వైద్యశాల తీసుకెళ్లే క్రమంలో మార్గమధ్యంలో వాహనానికి ఉన్న టైరు ఉబ్బినట్లు అనిపించడంతో దిగి టైరును చూసే క్రమంలో టైరు పగిలి కంటిలో మేకు గుచ్చుకపోయిందని తెలిపారు. వైద్యం చేసుకుని ఇంటిలో ఉండటాన్ని తెలుసుకున్న 108 సిబ్బంది ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. 108 సిబ్బందికి ప్రమాదాలు జరిగితే ప్రభుత్వం ఆదుకొని వారికి వైద్య సేవలతో పాటు ఆర్థిక సాయం అందించాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎస్‌వి.రమణ, ఉపా ధ్యక్షులు వెంకటాచలపతి, కార్యదర్శి యశ్వంత్, ట్రెజరర్ యోగానందరెడ్డి పాల్గొన్నారు.



అంజికి ఆర్థిక సాయం అందిస్తున్న 108 సిబ్బంది

తూతూ మంత్రంగా రోడ్డుకు మరమ్మతులు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-గాలివీడు

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వస్తున్నారనే సమాచారంతో అత్యుత్సాహంగా గుంతల రోడ్డుపై వేసిన కంకర వాహన దారుల పాలిట శాపంగా మారింది. మండల పరిధిలోని గొటివీడు, గోరాన్‌చెరువు, వది సేలవంకలో గుంతల మయంగా ఉన్న రోడ్డుపై ఆర్‌అండ్‌బి అధికారులు కంకర వేసి తొక్కనివ్వకుండా అలాగే వదిలేయడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాహన దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు కంకర రాళ్లు ఎగిపడి వాహనాలు ధ్వంసం కావడంతో గాయాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలివీడు నుంచి ద్విచక్ర వాహనం రాయచోటి వెళ్తుండగా రాయచోటి నుంచి వస్తున్న కారు గో రాన్ చెరువు మలుపు వద్ద రాగానేది చక్రవాహనం స్పీడుగా పోతుండడంతో రాయి కంకరాయి తగిలి కారుకు తగలం వల్ల పదివేల రూపా యలు నష్టం వాటిల్లిందని కారు యజమాని సుబ్బారెడ్డి పేర్కొన్నారు. రోడ్డుపై కంకర వేసిన తర్వాత కంకర్‌ను రోడ్డు రోలర్‌తో తొక్కని వ్వకుండా అలానే వదిలేయడం వల్ల బస్సులు, జీపులు, కార్లు, ఆటోలు వెళ్లాలంటే జంకుతు న్నారని, టైర్లు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. తాత్కాలికంగా అధికారులు తీసుకున్న నిర్ణయానికి ప్రజలు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంకర రోడ్డును చదువు ను చేయించాలని కోరుతున్నారు.



కంకర తేలిన రోడ్డు

విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో జీవించాలి : కలెక్టర్



విభిన్నప్రతిభావంతుడికి పరికరం ఇస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నాయని వాటిని విభిన్న ప్రతిబభావంతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని హెచ్ఎంఎం ఉన్నత పాఠశాల ఆవరణలో కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో 397 మంది విభిన్న ప్రతిబభావంతులకు రూ.57.67 లక్షల ఖర్చుతో మూడు చక్రాల బ్యాటరీ సైకిళ్లు, ఇతర ఉపకరణాలను కలెక్టర్, ఎమ్మెల్యే, దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.రవిప్రకాష్ రెడ్డి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అందించిన ఉపకరణాలలో ఏవైనా లోపాలు వస్తే వాటిని సరిచేసి అందించేవారు ఇక్కడ లేకపోతే వాటి ఉపయోగం తగ్గిపోతుందన్నారు. అందువల్ల కొంత ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని ఉపకరణాలను నిత్యం ఉపయోగించేటప్పుడు అనేకమైన సమస్యలు వస్తుంటాయి వాటిని సరిచేసి త్వరితగతిని అందించగలిగితే దీర్ఘకాలంగా వారికి ఉపయోగపడతాయని అన్నారు. కంపెనీ ప్రతినిధులు కూడా స్థానికంగా అందుబాటులో ఉండాలని సూచించారు. గతంలో సరఫరా చేసిన ఉపకరణాలు ఎన్ని బాగున్నాయి ఆ సమస్యలను రెక్టిఫై చేశారా లేదా అని సర్వే చేసి ఖచ్చితమైన నివేదిక రూపొందించాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ ఎడిని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ విప్ ఆరవ శ్రీధర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే నియోజకవర్గంలో 397 మందికి 662 ఉపకరణాలను 57 లక్షల రూపాయలు ఖర్చుతో ఇవ్వడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. 71 మందికి మూడు చక్రాల బ్యాటరీ సైకిల్స్, నడవలేని వారికి ఉపకరణాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. దివ్యాంగ సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.రవిప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు స్వతంత్రంగా జీవించడానికి ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఆర్.బి కృష్ణ కిషోర్, తహశీల్దార్ మహబూబ్ చాంద్, ఎంపిడిఒ నాగార్జున, మండల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ : 'చమర్తి'

ప్రజాశక్తి-నందలూరు

ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో చెరువులు జలకళ సంతరించుకుందని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం నాగిరెడ్డిపల్లిలోని ఎర్ర చెరువుకు అలుగు పారడంతో ఆయన గంగమ్మకు పూజలు నిర్వహించి జల హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అరాచక పాలనకు విసిగిపోయిన ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని అత్యధిక మెజార్టీతో పట్టం కట్టారని అన్నారు. ఆర్థికంగా వెనకబడిన, అప్పుల పాలైన రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు చర్యలు చేపట్టారని అన్నారు. అధికారులు, పార్టీ యంత్రాంగం సమిష్టిగా కృషిచేసి చెరువులకు నీరు తెప్పించారని పేర్కొన్నారు. నందలూరు, రాజంపేట ప్రాంతాల్లోని ఏడు చెరువులకు నీరు అందించడం జరుగుతుందని అన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో అన్నమయ్య ప్రాజెక్టు డిఇ మురళీకృష్ణ, ఇరిగేషన్ ఎఇ మధుసూదన్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, పాటూరు గ్రామ అధ్యక్షులు ముమ్మడిశెట్టి రమేష్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, నీటి సంఘం అధ్యక్షుడు భూశెట్టి వెంకటసుబ్బయ్య, టిడిపి నాయకులు పసుపులేటి ప్రవీణ్, తాటి సుబ్బరాయుడు, గంగాధర్, నారపుశెట్టి శివ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



చెరువుకు జలహారతి ఇస్తున్న జగన్మోహన్‌రాజు

ప్రజా సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రజా సమస్యల పరిష్కార వేదికగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పుల్లంపేట తహశీల్దార్ అరవింద్ కిషోర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులలో భాగంగా మంగళవారం అనంతసముద్రం పంచాయతీ ఎ.చెన్నమంబపురం సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో సామాజిక సమస్యల పట్ల ప్రజలు స్పందించి విన్నపాలు అందించాలని కోరారు. వీటిలో భూ వివాదాలు, భూ సమస్యలు, మ్యుటేషన్, భూముల సరిహద్దు సమస్యలపై పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు వివరించారు. రెడ్డిపల్లె రెవెన్యూ సదస్సులో మొత్తం 149 అర్జీలు అందాయని వాటిలో 77 రెవెన్యూ ,8 రేషన్ కార్డు, 35 పెన్షన్,2 దేవాదయ శాఖ ,13 సర్వే కోసం, గృహ నిర్మాణం కోసం 14, సంబంధించిన అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుశీల్ కుమార్, మండల సర్వేయర్ శ్రీరాములు, వీఆర్వో నరసింహులు, మండల సర్వేయర్ శ్రీరాములు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **తంబళ్లపల్లె:** మండలంలోని కన్నమడుగులో రెవెన్యూ గ్రామ సదస్సు జరిగింది. ప్రజలు గ్రామ సమస్యలపై అర్జీలు అందజేశారు.రెవెన్యూ సదస్సు నందు మొత్తంగా 7 అర్జీలు సమర్పించారు.3 రెవెన్యూ రికార్డులలో సవరణ కొరకు, 4 పింఛన్ మంజూరు చేయవలసినదిగా కొరకు వచ్చినట్లు తాసిల్దార్ హరికుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి మధుసూదన్, అటవీ శాఖ ఈవో రామ్ రాజ్,డిటి రవి,వీఆర్వో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట ఆర్‌టిసి డిపో తరలింపు తగదు

- అఖిలపక్షం ఆధ్వర్యంలో వినూత్న నిరసన

ప్రజాశక్తి-మదనపల్లె

లాభాల బాటలో ఉన్న బి.కొత్తకోట ఆర్‌టిసి డిపోను మూసివేసి మదనపల్లెకు తరలించిన దుర్దినాన్ని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక జ్యోతి చౌక్‌లో సిపిఐ, కాంగ్రెస్ ,బాస్, ఎఐటియుసి తదితర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆర్‌టిసి డిపో 18వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. డిపోను తరలించే సందర్భంలో వివిధ రాజకీయ పార్టీలు నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల దినపత్రికల క్లిప్పింగులతో కూడిన బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ఆర్‌టిసి బస్సు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. పాలకుల నిర్లక్ష్య వైఖరి నశించాలని, వెంటనే ఆర్‌టిసి డిపోను ప్రారంభించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఐ నియోజకవర్గపు కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, భారతీయ అంబేద్కర్ సేన నాయకులు ఎస్.సచిన్, సిపిఐ నాయకులు యస్.బషీర్ ఖాన్, ఎఐటియుసి మండల కార్యదర్శి జి.రఘునాథ్ మాట్లాడుతూ ఆర్‌టిసి డిపో ఏర్పాటు చేయాలని, ఏ ఒక్కరికి చిత్తశుద్ధిలేకపోవడం బాధాకరమైన విషయమని అన్నారు.ఎటువంటి అర్హతలు లేకున్నా బి.కొత్తకోటను నగర పంచాయతీ చేసిన గత వైసిపి నాయకులు ఆర్‌టిసి డిపో ఏర్పాటు చేస్తున్నామని తూతూమంత్రంగా ఎన్నికల ముందు హడావుడి చేసి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు .యువగళం పాదయాత్రలో ఆర్‌టిసి డిపోను పునరుద్ధరిస్తామని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని ఆ హామీకి కట్టుబడి డిపోను ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చ రించారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.అష్రఫ్‌అలీ, సీనియర్ నాయకులు హెచ్.షమీముల్లా, మాజీ మండల కో-ఆప్షన్ మెంబర్ సయ్యద్‌అమీర్, యస్.తంబయ్యశెట్టి, నారాయణస్వామి, గంగులప్ప, దుమ్ము, బాబు, కిట్టన్న,వెంకటేష్, మనోహర్, రియాజ్, గంగాద్రి పాల్గొన్నారు.



ఆర్‌టిసి బస్సు చిత్రానికి నివాళి అర్పిస్తున్న అఖిలపక్ష నాయకులు

వెంకటసుబ్బయ్య సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఇఒపిఆర్‌డి వెంకటసుబ్బయ్య సేవలు మరువలేనివని ఎంపిడిఒ అబ్దుల్ రహీం కొనియాడారు. వెంకటసుబ్బయ్య గతంలో క్రింది స్థాయి ఉద్యోగం చేసి అంచెలంచెలుగా ఎదిగి పదోన్నతులు పొంది అనేక మండలాలలో విధులు నిర్వహించి కలకడకు ఈ మధ్యకాలంలో ఇఒపిఆర్‌డిగా బాధ్యతలు చేపట్టి ఉద్యోగ విరమణ పొందడం కొంతవరకు బాధాకరమని అన్నారు. పదవీ విరమణ సర్వసాధారణమని అన్నారు. నిగర్వి, సౌమ్యుడు, ఉదార స్వభావం గల వారు, నిస్వార్థపరుడైన వెంకటసుబ్బయ్య ఉద్యోగ విరమణ పొందడం కొంతవరకు బాధాకరంగానే ఉందని అన్నారు. అనంతరం పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగాసన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు విశ్వనాథ నాయుడు, వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ ఎపిఒ చెన్నకేశవులు, ప్రతాపరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మహబూబ్‌బాషా, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వెంకటసుబ్బయ్యను సన్మానిస్తున్న సిబ్బంది



గోకులంలో నిర్మాణాలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

గోకులాల నిర్మాణాలను తనిఖీ చేసిన డ్వామా పీడీ

ప్రజాశక్తి-కలకడ

మండలంలో పలు పంచాయతీలలో నిర్మిస్తున్న గోకులంలో షెడ్డు నిర్మాణాలను డ్వామా పీడీ వెంకట రత్నం తనిఖీలు నిర్వహించినట్లు ఎపిఒ చెన్నకేశవులు తెలిపారు. మండలంలో మంజూరైన 60 గోకులములను వెం టనే నిర్మించాలని సూచించినట్లు తెలిపారు. మంగళవారం మండలంలోని దొడ్డిపల్లి పంచాయతీ గోపాలపురం, దేవలపల్లి పంచాయతీలో దేవలపల్లి, గంగాపురం పంచాయతీలో కత్తివారిపల్లిలో నిర్మిస్తున్న గోకులం నిర్మాణాలను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చినట్లు తెలిపారు. 10వ తేదీలోగా గోకులాల నిర్మాణాలను పూర్తిచేయాలని ఆదేశించారని అన్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల సచివాలయం సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

టిఎన్ బంగ్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు తంబళ్లపల్లెలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు పట్టణంలోని టిఎన్ వంశీయుల బంగ్లాను మంగళవారం మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ పరిశీలించారు.తహశీల్దార్ హరికుమార్, స్కిల్ డెవలప్మెంట్ జిల్లా మేనేజర్ నాగార్జున, పారిశ్రామికవేత్త టిఎన్.అరవింద రెడ్డి, రాజశేఖర్ రెడ్డితో కలసి బంగ్లాలో మొత్తం కలియ తిరిగి పరిశీలించారు. నివేదికలు తయారుచేసి కలెక్టర్‌కు పంపనున్నట్టు రెవిన్యూ అధికారులు చెప్పారు. మండల ఇన్‌ఛార్జి సర్వేయర్ రఫీ, టిఎన్ మేనేజర్ మునిరత్నం, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్



పట్టుబడిన కారు, ఎర్రచందనం దుంగలతో అటవీ శాఖ సిబ్బంది

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

కారుతో సహా ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు అటవీ శాఖ నిఘా విభాగం డిఎఫ్ఒ ఎం.గురుప్రభాకర్ తెలిపారు. మంగళవారం డిఎఫ్ఒ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు పీలేరు-చిత్తూరు మార్గంలోని ఎంజెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో 30న వాహనాల తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీలేరు వైపు నుంచి వచ్చిన ఓ కారును డ్రైవర్ కొంత దూరంలో ఆపి పరారయ్యాడని తెలిపారు. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 62 కేజీల బరువు గల ఆరు ఎర్రచందనం దుంగలున్నట్లు గుర్తించామన్నారు. కారుతో సహా, ఎర్రచందనం దుంగల విలువ రూ.6 లక్షలు ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో తనతో పాటు ఎఫ్ఆర్ఒ ఎస్ చంద్రశేఖర్, ఎఫ్ఎస్ఒ కె. ప్రతాప్, ఎఫ్‌బిఒ, ఎఫ్ఎస్‌పి పాల్గొన్నారు.

తిరుపతిలో కలికిరి వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి-కలికిరి

కలికిరికి చెందిన అజంతుల్లా అనే వ్యక్తి తిరుపతిలోని ప్రియదర్శిని కూరగాయల మార్కెట్లో దారుణహత్యకు గురయ్యాడు.. మృతుని కుటుంబ సభ్యుల కథనం మేరకు కలికిరి పట్టణానికి చెందిన కొవ్వూరు మస్తాన్ కుమారుడు కొవ్వూరు అజంతుల్లా (38) గత కొంతకాలంగా తిరుపతిలోని మార్కెట్లో వ్యాపారం చేసుకుంటూ ఉండేవాడని తెలిపారు. మంగళవారం ఉదయం తిరుపతిలోని నిమ్మకాయలవీధికి చెందిన రుద్ర, అతని కుమారులు యశ్వంత్ కల్యాణ్‌తో రూ.1500లు డబ్బు విషయమై ఘర్షణ చోటు చేసుకుందని అన్నారు. ఆవేశానికి లోనై రుద్ర అతని కుమారులు అజంతుల్లాను కత్తితో దాడి చేశారని చెప్పారు. తీవ్రంగా గాయపడిన అతనిని స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లేలోకి మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని హతుడు తోపాటు ఇద్దరు కొడుకులను అరెస్టు చేసి, కత్తిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-కలకడ

ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో యువకుడికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రమైన కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో కెవిపల్లి మండలం, తిమ్మాపురం పంచాయతీ, బురుజు కాడపల్లికి చెందిన రెడ్డిభాషా తన సొంత పనుల మీద ద్విచక్ర వాహనంలో కలకడకు వచ్చి తిరిగి సొంత ఊరికి వెళుతుండగా చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారిపై తాను ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి కింద పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో రెడ్డి భాషకు చేతులు, ముఖానికి బలమైన రక్తగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పైలట్ శ్రీనివాసులు తెలిపారు.

ఆటో ఢీకొని ఇద్దరికి..

మదనపల్లె అర్బన్ : ఆటో ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మంగళవారం పిటియం మండలంలో జరిగింది. పిటిఎం ఎస్ఐ రవికుమార్ కథనం మేరకు.. ఘటనపై మండలంలోని మద్దయ్యగారి పల్లి పంచాయతీ, కొండువారిపల్లికి చెందిన రైతు నారాయణ(65), అదే గ్రామానికి చెందిన బిటెక్ విద్యార్థి రణదీప్ ద్విచక్ర వాహనంలో మద్దయ్యగారిపల్లికు బయల్దేరారు. మార్గ మధ్యంలోని పులగుంటోళ్ల పల్లె వద్ద ఆటో ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి బాధితులను 108లో బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. పరీక్షించిన వైద్యులు ఇద్దరిని తిరుపతికి రెఫర్ చేశారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ తెలిపారు.

బస్సు ఢీకొని చేనేత కార్మికుడు దుర్మరణం

- మహిళ పరిస్థితి విషమం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

బస్సు ఢీకొని చేనేత కార్మికుడు మృతి చెందగా, ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన సోమవారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లి పట్టణం కనకదాసునగర్‌లో నివాసముంటున్న ఆంజనేయులు కుమారుడు జి.శివ (25)చేనేత కార్మికుడు. అదే వీధిలో ఉంటున్న బంధువుల మహిళ శిల్ప(22)తో కలసి ద్విచక్ర వాహనంలో ముదివేడుకు వెళ్లారు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలోని కురబలకోట మండలం రైల్వే స్టేషన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మదనపల్లి నుంచి తంబళ్లపల్లికి వెళుతున్న ఆర్‌టిసి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో శివ అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన శిల్ప కోమాలోకి వెళ్లింది. బాధితురాలిని కురబలకోట 108 సిబ్బంది మనోహర్, రఫీ లు చికిత్స నిమిత్తం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.